క్లుప్తంగా

అబాకస్ పరీక్షలో నగర విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ సంస్థ యూసీమాస్ ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పరీక్షలో ఆర్య అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి, అవార్డులు గెలుపొందినట్లు డైరెక్టర్లు వేమూరి ప్రదీప్ కుమార్, నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక సంగడిగుంటలో బృందావన్ ఎన్‌క్లేవ్‌లోని ఆర్య అకాడమీలో సోమవారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూల్ స్థాయి విద్యార్థులకు మెంటల్ అర్థమెటిక్ శిక్షణలో ఫ్లాష్, రీజనింగ్, ఓరల్, స్పీడ్ క్యాలిక్యులేషన్ కాంపిటీషన్స్ ద్వారా జ్ఞాపకశక్తి అద్భుతంగా పెరుగుతుందని, తద్వారా భవిష్యత్తులో ఐఐటీ లాంటి జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధిస్తారని తెలిపారు.

మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీ పడొద్దు



గుంటూరు ఎడ్యుకేషన్: మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీపడొద్దని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహమ్మద్ ఖాసిం తెలిపారు. సంగడిగుంటలోని నగరపాలకసంస్థ ఉర్దూ మోడల్ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో రుచిగా, శుచిగా విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ్యాంశాల ఆధారిత సామర్థ్యాలు కలిగి ఉండే విధంగా విద్యార్థులను తరగతుల వారీగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. సమష్టి కృషితో పని చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షంషాద్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన నగర విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: రోల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఇటీవల కాకినాడలో నిర్వహించిన 7వ మినీ స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటినట్లు పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ ఉన్నత పాఠశాల పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2వ తరగతి విద్యార్థిని మనస్విని, 4వ తరగతి విద్యార్థి కార్తికేయ బంగారు పతకాలు, 6వ తరగతి విద్యార్థి గణేష్ రజత పతకాన్ని సాధించినట్లు వివరించారు. తమ పాఠశాలలో క్రీడల్లో పటిష్టమైన శిక్షణతో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, పాటిబండ్ల బాలాత్రిపుర సుందరి, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ–ప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె. హరిప్రియ పాల్గొన్నారు.

కుట్రలో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్



పట్నంబజారు: కుట్రలు, కుతంత్రాలు, కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్ మండిపడ్డారు. నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. నారా వారి సారా పాలన ప్రతి ఒక్కరికీ తెలుసని, వీధికి పది బెల్టు షాపులు, ఊరికి వంద వైన్ షాపులు పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వమే లిక్కర్ పాలసీ విధానాన్ని తీసుకుని మద్యం విక్రయిస్తే.. అసలు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసి, కూటమి నేతల అక్రమార్జన కోసం అవినీతిని పెంచి పోషించింది చంద్రబాబు కాదా ? అని మండిపడ్డారు. మద్యం స్కాంకు చంద్రబాబు మూలమని, ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్‌గా చేసుకుని, అక్రమ అరెస్ట్ పర్వానికి నాంది పలుకుతున్నారన్నారని దుయ్యబట్టారు. కచ్చితంగా ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.



మూడు వంతెనల బ్రిడ్జి వద్ద నీట మునిగిన దుకాణాలు



వర్షపు నీటితో మునిగిన మూడు వంతెనల బ్రిడ్జి



అంకమ్మనగర్‌లో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

ఎడతెగని వర్షం.. స్తంభించిన జన జీవనం



నెహ్రూనగర్: నగరంలో సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. నగరంలో లోతట్టు ప్రాంతాలైన కంకర గుంట ఫ్లైఓవర్, మూడు వంతెనలు, కొరిటిపాడు, పాత గుంటూరు, మార్కెట్ సెంటర్, ఉమెన్స్ కాలేజీ రోడ్డు, జేకేసీ కాలేజీ రోడ్డు, కొత్తపేట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో కొన్ని వీధులు నీట మునిగాయి. సాయంత్రం వేళలో వర్షం భారీగా పడటంతో పాఠశాలల నుంచి విద్యార్థులను తీసుకువెళ్లే తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. చిరు వ్యాపారులు, కార్యాలయాల్లో విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. నగరంలోని పీకలవాగు వెంబడి ఉన్న కాలనీల్లోకి, అంకమ్మనగర్‌లో ఇళ్లల్లోకి మురుగు నీరు చేరడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంటి సామగ్రి తడిసిపోయింది. పీకల వాగు వెంబడి రక్షణ గోడ లేకపోవడం వల్ల వర్షాకాలంలో అవస్థలు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు.



కంకరగుంట అండర్‌పాస్ వద్ద నిలిచిన నీరు



వర్షంలో నగరవాసుల అవస్థలు



మూడు వంతెనల బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్





వర్షంలో నగరవాసుల అవస్థలు

బ్రెయిన్... మనిషికి మెయిన్

ఎవరైనా తప్పు చేస్తే మనం వెంటనే బ్రెయిన్ లేదా? దాన్ని ఎలా చేయాలో తెలియదా? అంటూ మందలిస్తాం. మనిషి దైనందిన జీవితంలో చేసే పనులన్నీ కూడా బ్రెయిన్ ద్వారానే జరుగుతాయి. జ్ఞానేంద్రియాలకు ఇది ముఖ్యమైన కేంద్రం. మెదడు పనిచేయకపోతే మనిషి జీవచ్ఛవం కింద లెక్కే. శరీరంలోని కీలకమైన అవయవాలన్నీ కూడా మెదడు ఇచ్చే ఆదేశాల ద్వారానే పని చేస్తుంటాయి. కొన్ని వ్యాధులు, ప్రమాదాల్లో గాయపడటం వల్ల దెబ్బతిని, పని చేయక మనిషి చనిపోవడం జరుగుతుంది. మెదడును పరిరక్షించుకోకపోతే వచ్చే అనర్థాలు, వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జులై 22న వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

–గుంటూరు మెడికల్

- ఆధునిక జీవనశైలితో పెరుగుతున్న బ్రెయిన్ సమస్యలు
- ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులకు చెక్
- నేడు వరల్డ్ బ్రెయిన్ డే



బ్రెయిన్ అవగాహన పోస్టర్స్

మెదడు గురించి ఆసక్తికర విషయాలు

మనిషి శరీరంలో మొత్తం బరువులో రెండు శాతం బరువు బ్రెయిన్ ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఎదుగుతూ ఉంటుంది. పగలు కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువ యాక్టీవ్‌గా పని చేస్తుంది. శరీరం మొత్తం వినియోగించుకునే శక్తిలో 20 శాతాన్ని వినియోగించుకుంటుంది. 75 శాతం నీరు ఉంటుంది. 1300 నుంచి 1400 గ్రాముల బరువు ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల్లో 350 నుంచి 450 గ్రాములు ఉంటుంది.

మెదడుకు ఇబ్బందికర పరిస్థితులు ఇవి..

ప్రమాదాల్లో తలకు గాయాలవ్వడం, పక్షవాతం, మెదడులో ట్యూమర్లు ఏర్పడడం, పార్కిన్‌సన్స్ వ్యాధి, ఒత్తిడి, డెమెన్షియా, డిప్రెషన్ కారణాల వల్ల మెదడు దెబ్బతింటుంది. తలనొప్పి, వాంతులు అవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించలేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయనే విషయం గుర్తించాలి.

వంద కోట్ల మందికి పైగా బ్రెయిన్ సమస్యలు

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం వంద కోట్ల మందికి పైగా మెదడు సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా మెదడు సమస్యల బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ప్రతిరోజూ 150 మంది, న్యూరో సర్జరీ విభాగంలో వంద మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరు జిల్లాలో 50 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుని వద్దకు 20 నుంచి 30 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. చిన్న వయస్సు మొదలుకొని పెద్ద వారి వరకు అందరికి బ్రెయిన్ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. ప్రాథమిక దశలోనే వీటిని గుర్తించే ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు నేడు అందుబాటులో ఉన్నాయి.

ట్యూమర్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

మెదడులో ఏర్పడే కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో ఫిట్స్ వస్తాయి. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ ఉండాలి. చేతులు, కాళ్ళు పనిచేయకపోతే పక్షవాతం అని భావిస్తారు. బ్రెయిన్‌లో గడ్డ ఉండటం వల్ల కూడా ఇలా జరగవచ్చు. అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా వాటిని నిర్ధారిస్తారు.

న్యూరో నావిగేషన్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



బ్రెయిన్ సర్జరీల్లో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. కీ హోల్ సర్జరీల ద్వారా పూర్తిగా ఓపెన్ చేయకుండానే ఆపరేషన్లు చేయడం ద్వారా చాలా త్వరితగతిన రోగులు కోలుకుంటున్నారు. న్యూరో నావిగేషన్ చికిత్స విధానాల ద్వారా అరుదైన ట్యూమర్‌లను సైతం చాలా సులువుగా తొలగించి ప్రాణాలు కాపాడుతున్నారు. అన్ని బ్రెయిన్ ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు. తలకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా బ్రెయిన్ డామేజీ జరగకుండా కాపాడుకోవచ్చు.

–డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి,
న్యూరోసర్జన్, గుంటూరు

మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి



బ్రెయిన్ వయస్సు పెరిగే కొద్ది అనేక ఆటుపోటులకు గురవుతోంది. పదిలంగా కాపాడుకుంటే పదికాలాలు హాయిగా జీవితాన్ని కొనసాగించవచ్చు. ముఖ్యంగా ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, నడక లాంటి శారీరక వ్యాయామాలు చేయాలి. మద్యపానం, ధూమపానాలకు దూరంగా ఉండాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా పజిల్స్ చేయడం, నూతన విషయాలు నేర్చుకోవడం చేయాలి. బ్రెయిన్ సంబంధిత సమస్యలపై ప్రజలకు, వైద్య వృత్తిలో ఉన్న వారికి అవగాన కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ పమిడిముక్కల విజయ,
ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు

ప్రజల సమాధుల మీద ఆరోగ్య పరిశ్రమ పునాదులు

జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

లక్ష్మీపురం: ప్రపంచంలో ఆయుధ పరిశ్రమ తర్వాత ఎక్కువ ఆదాయం పొందుతోంది ఆరోగ్య పరిశ్రమేనని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి తెలిపారు. ప్రజల రోగాలు అనే సమాధుల మీద పునాదులు లేపుకోవడమే ఆరోగ్య పరిశ్రమ అని విమర్శించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక గౌరవ అధ్యక్షుడు కె.రామిరెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ సమాజంలో అవిద్య, అజ్ఞానం, ఆకలి, మూఢ నమ్మకాలు, ఇంగిత జ్ఞానం లేకపోవడం తదితర కారణాల వల్ల పరిశ్రమలు లక్షల కోట్ల రూపాయలు గడిస్తున్నాయని తెలిపారు. రోగాల్లో 80 శాతం డాక్టర్ల వద్దకు పోవాల్సిన అవసరం లేదని, సరైన అవగాహనతో ఇంట్లోనే ప్రాథమిక చికిత్స చేసుకోవచ్చని సూచించారు. ప్రతి రోగానికి మందు అనే కల్చర్‌లో పీకల దాకా కూరుకు పోయిన ప్రజలు వేరుశనగ విత్తనాలు, బెల్లం తింటే రక్తం పెరుగుతుందనే విషయం మరచి పోయారని తెలిపారు. చాలామంది డాక్టర్లు కూడా వైద్యం డిగ్రీ రాగానే వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డిగ్రీ తీసుకునేటప్పుడు తాము చేసిన ప్రమాణం మరిచిపోతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ నేత ఏ.వి.రామారావు, జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు సేతు రమేష్ , అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ప్రసంగించారు.

జాతీయ ఈత పోటీలకు కార్తికేయ ఎంపిక



కార్తికేయను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: వైజాగ్‌లో ఈనెల 19, 20వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ ప్లస్ టూ బైపీసీ విద్యార్థి ఎస్.కార్తికేయ ఆగస్టు రెండో తేదీ నుంచి ఏడు వరకు అహ్మదాబాద్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి కార్తికేయ ఐదు విభాగాల్లో ఐదు స్వర్ణ పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యతను ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు. క్రీడలు విద్యార్థి సమగ్ర మానసిక వికాసానికి దోహదపడతాయని పేర్కొన్నారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవ పున్నయ్య, ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు, అకడమిక్ కో–ఆర్డినేటర్ శైలజ విద్యార్థి కార్తికేయను అభినందించారు.

బీజేపీ జిల్లా నూతన పదాధికారుల నియామకం

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా నూతన పదాధికారులను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పాలన విజయాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని నూతన పదాధికారులకు సూచించారు.

- జిల్లా ఉపాధ్యక్షులుగా మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ, వంగిపురపు విమలాదేవి, రెడ్డి శివపార్వతి, కటారి వాసుదేవ నాయుడు, కత్తి మేరీ సరోజిని నియమితులయ్యారు.
- ప్రధాన కార్యదర్శులుగా హెచ్. రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కార్యదర్శులుగా పంచుమర్తి ప్రసాద్, ఆర్. వెంకటలక్ష్మి, మార్తా నరేంద్ర, నారదాసు వీరమణీంద్ర, కె. నారాయణరెడ్డి, సురేష్ కుమార్ జైన్, దానబోయిన శివయ్య, కోశాధికారిగా ఆమతి వెంకటరమణ, ఐటీ కన్వీనర్‌గా కటకం అనూష, సోషల్ మీడియా కన్వీనర్‌గా తూనుగుంట్ల రాజేష్ నియమితులయ్యారు.

లులూకు ఆర్టీసీ స్థలాలు కేటాయించడం సరికాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు



మాట్లాడుతున్న బాబూరావు

లక్ష్మీపురం: కూటమి ప్రభుత్వం విజయవాడలోని ఐదు ఎకరాల ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లులూ అనే బహుళ జాతి కంపెనీకి ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు అన్నారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. విశాఖపట్నంలో 13 ఎకరాల పైగా స్థలాన్ని ఇలాగే ఆ సంస్థలకు కేటాయించనున్నారని, ఇదొక భారీ కుంభకోణమని ఆరోపించారు. ఆర్టీసీని అమ్మేయటానికి, ప్రైవేట్ పరం చేయడానికి ఇదొక కుట్ర అని ఆయన ఆరోపించారు. ఆర్టీసీ స్థలాలిచ్చి దాన్ని చంపేద్దామని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రిలయన్స్, మెట్రో, వాల్ మార్ట్, డీ మార్ట్ వంటి పెద్ద కంపెనీలు మార్కెట్లోకి వచ్చి చిన్న, మధ్య తరగతి వ్యాపారస్తులు నాశనం అయి పోయారని తెలిపారు. లులూ వస్తే కొనఊపిరితో ఉన్న చిరు వ్యాపారుల గొంతు కోయడమేనని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమానికి దిగుతామని ఆయన తెలిపారు.

జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలో సత్తా చాటిన అక్షర



అక్షరను అభినందిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 19, 20వ తేదీల్లో జరిగిన 52వ జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సుమేధ హైస్కూల్ విద్యార్థిని సంకట సాయి అక్షర సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎన్జీవో కాలనీలోని పాఠశాలలో జరిగిన అభినందన సభలో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అండర్–11, 13 బాలికల విభాగం సింగిల్స్, డబుల్స్‌లో అక్షర ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో పలువురు క్రీడాకారులతో పోటీపడిన తమ విద్యార్థిని ప్రథమ స్థానం సాధిండం గర్వకారణమని పేర్కొన్నారు. చదువుతో పాటు విద్యార్థులను ఆటపాటల్లో ప్రోత్సహిస్తూ, ప్రావీణ్యులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. రాంబాబు, పీఈటీ కిరణ్‌రెడ్డి, విద్యార్థిని తల్లిదండ్రులు ప్రశాంతి, దుశ్యంత్‌రెడ్డి, తాతయ్య గుజ్జుల జయరామిరెడ్డి పాల్గొన్నారు.